క్లుప్తంగా

చిన్నస్వామి సరిగెత్తు


చిన్న స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని గగ్గటూరు గ్రామంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న చిన్న స్వామి సరిగెత్తు శుక్రవారం ముగిసింది. గ్రామంలో కొలువుదీరిన చిన్న స్వామి పీరును ప్రత్యేక అలంకరించి ఫాతేహాలు జరిపారు. శుక్రవారం గ్రామంలోని తెల్లవారుజామున స్వామి వారిని ఊరేగింపు ప్రారంభమై ఉదయం యథావిధిగా పీర్ల చావిడీలో కొలువుదీరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న ఎద్దుల సూర్యరెడ్డి దంపతులు

కోడుమూరు రూరల్: ప్రజలంతా చెట్లను సంరక్షించుకోవడంతో పాటు, పర్యావరణానికి పెను భూతంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకుని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎద్దుల సూర్యరెడ్డి సూచించారు. 'గో గ్రీన్.. సేవ్ గ్రీన్..లివ్ గ్రీన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎద్దుల సూర్యరెడ్డి దంపతులు పట్టణంలో వెయ్యి మంది విద్యార్థులకు మొక్కలు, జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, డైరెక్టర్ ఎద్దుల సత్యారెడ్డి, నాగార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉట్టి కొట్టే కార్యక్రమం, నృత్యాలు, భగవద్గీత బోధనలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నేటి నుంచి గోకులాష్టమి వేడుకలు

పాణ్యం: స్థానిక శ్రీ వీరనారాయణస్వామి ఆయలంలో శనివారం నుంచి గోకులాష్టమి వేడుకలు ప్రారంభమవుతాయని దేవదాయశాఖ ఈఓ కె. సువర్ణ శుక్రవారం తెలిపారు. శనివారం శ్రీవారి కల్యాణం, 17న స్వామి వారికి ప్రత్యేక పూజలు, 18న అన్నప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గడివేముల: మండల పరిధిలోని గని, సోలార్ ప్లాంట్ రహదారిలో బైకు అదుపుతప్పి కిందపడటంతో వ్యక్తి మృతిచెంది ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గని గ్రామానికి చెందిన ఉదయగిరి కుమార్ శెట్టి, ఆగోల ఈశ్వర్ (26) సోలార్ ప్లాంట్‌లో విధులు నిర్వహించి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రధాన రహదారిలోని జగనన్న కాలనీ వద్ద కుక్క అడ్డురావడంతో.. బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. దీంతో ఆగోల ఈశ్వర్‌కు తలకు గాయం కాగా.. స్పృహ కోల్పోయాడు. స్థానికులు సోలార్ అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



చిన్న అమ్మవారి శాలలో, గంధం అలంకరణలో లలితా త్రిపురసుందరి

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్ర పారాయణాలు చేశారు. పాతనగరంలోని లలితా పీఠంలో లలితా సుందరేశ్వరిని గంధంతో అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్న అమ్మవారి శాల, పెద్దఅమ్మవారి శాల, నిమిషాంబదేవి ఆలయం, కాళికాంబ దేవి ఆలయం, మాతా అంబా భవానీ ఆలయం, అరోరా నగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, హరిశ్చంద్ర శరీన్ నగర్‌లోని త్యాగరాజ సీతారామాలయాలు భక్తులతో సందడిగా మారాయి.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

కోడుమూరు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. శుక్రవారం నియోజకవర్గవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలపై మువ్వన్నెల జాతీయ జెండా రెపరెపలాడింది. ఆయా కార్యాలయాల్లో ఎంపీపీ గాడి రూతమ్మ, తహసీల్దార్ నాగరాజు, నాగార్జున హైస్కూల్లో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న, ఆయా పాఠశాలల్లో పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జెండావిష్కరించారు. కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో సీనియర్ హోంగార్డు సుంకన్న చేత సీఐ తబ్రేజ్ జెండావిష్కరింపజేసి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. అమడగుంట్ల హైస్కూల్లో చదువు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు హెచ్‌ఎం అనంతయ్య బహుమతులను అందజేశారు. జెండావిష్కరణ కార్యక్రమాల్లో ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ వసంతలక్ష్మి, మాజీ సర్పంచులు సీబీ.లత, కేఈ.రాంబాబు, గ్రామ పెద్దలు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

● గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్, కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో శరత్‌కుమార్‌రెడ్డి, జ్యోతి హైస్కూల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు .వెంకటేశ్వర్లు జెండావిష్కరణ చేసి స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఉన్న గాంధీ విగ్రహానికి తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ పురుషోత్తం, రెవెన్యూ అధికారులు పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పరమేష్ నాయక్ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంతల మునెప్ప, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, జెడ్పీ మోడల్ పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్లు గోవిందు, తిప్పన్నలు, ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామ పెద్ద స్వర్గీయ సీబీ సత్యవ్రతరెడ్డి జ్ఞాపకార్థం నగదు బహుమతులను అందజేశారు. అలాగే సంగాలలో విద్యార్థులకు నగదును బహుమతులను ప్రదానం చేశారు.

కర్నూలు(రూరల్): మండల పరిధి పంచాలింగాల గ్రామ సచివాలయంలో, జిల్లా పరిషత్ హైస్కూల్, మండల ప్రాథమిక పాఠశాలలో పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్, ఎంపీడీఓ జి.రఘునాథ్, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ కృపవరం, మండల ఏపీఓ మధుబాబు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, తహసీల్దారు టీవీ.రమేష్ బాబు, డీటీ శివ ప్రసాద్, గార్గేయపురం గ్రామం సచివాలయం -1లో సర్పంచ్ సోమేశ్వరమ్మ జాతీయ జెండాను ఎగురవేశారు.


జెండావిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి


జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి, పోలీసులు, అధికారులు


కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో జెండావిష్కరిస్తున్న ఎంపీపీ గాడి రూతమ్మ


జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ


జెండా వందనం చేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప


పంచలింగాలలో జెండా వందనం చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు


జెండా వందనం చేస్తున్న తహసీల్దారు టీవీ రమేష్‌బాబు


జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి


ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ


రాక్‌గార్డెన్‌లో వేడుకలను నిర్వహిస్తున్న పర్యాటక శాఖ అధికారులు


శకునాలలో విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు ప్రవీణ్‌కుమార్


జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కల్లూరు ఎంపీపీ శారద

వాడవాడలా ఎగిరిన త్రివర్ణ పతాకం

పాణ్యం : 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడవాడల మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి జెండాను ఎగరవేశారు.

– ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ ఉసేన్‌బీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, సర్పంచ్ మేకల పల్లవి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ సీసీ నాగార్జునరెడ్డి, ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద గ్రామసర్పంచ్‌లు జెండాను ఎగరవేశారు. కస్తూర్బా పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ రుబీనా ఆధ్వర్యంలో విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఓర్వకల్లు : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ శ్రీనివాసులు, పోలీసు స్టేషన్ వద్ద ఎస్‌ఐ సునీల్‌కుమార్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఎంఏఓ మధుమతి జెండాను ఆవిష్కరించారు.


గడివేములలో జెండా ఎగురవేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు


మీదివేములలో జెండాకు వందనం సమర్పిస్తున్న సర్పంచు రజితమ్మ, ఎంపీటీసీ సభ్యులు పద్మనాభరెడ్డి


కల్లూరులో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీపీఎం నాయకులు


కల్లూరులో మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

అదేవిధంగా మీదివేముల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచు రజితమ్మ, ఎంపీటీసీ సభ్యులు పద్మనాభరెడ్డి, శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. నన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు సర్పంచు బ్రహ్మయ్య పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. స్థానిక రాక్‌గార్డెన్‌లో పర్యాటక శాఖ అధికారులు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కల్లూరు: కల్లూరు అర్బన్ 29వ వార్డు శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 27వ వార్డు అబ్బాస్ నగర్‌లో రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు.

➤ కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోయ శారద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

➤ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులు జెండాను ఎగరవేశారు.

➤ స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు జెండాను ఎగరవేసి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. నాయకులు నాగరాజు యాదవ్, రామోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

➤ కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ సాయిబాబా, కె. సుధాకరప్ప, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా హాజరై జెండా వందనం చేశారు.

కల్లూరు: పెద్దపాడు గ్రామంలో దామోదరం సంజీవయ్య బాలల సదనంలో రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు సంజీవయ్య, విజయలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


జెండాను ఎగురవేస్తున్న రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు సుమలత

● ఇంద్రధనస్సు కనువిందు


పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలో శుక్రవారం సాయంత్రం ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. పలువురు ఈ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీసుకున్నారు.


రహదారి సమస్యను పరిష్కరించాలి


రహదారిపై నిల్వ ఉన్న వర్షపునీటిని పరిశీలిస్తున్న నాయకులు

ఓర్వకల్లు : మండల కేంద్రంలో ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించి, రహదారి పక్కన అర్ధాంతరంగా నిలిచిపోయిన మురుగు కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో అస్తవ్యస్తంగా తయారైన ప్రధాన రహదారిని, మధ్యలో నిలిచిపోయిన కాలువ నిర్మాణ పనులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి మర్రిచెట్టు వరకు రహదారి అస్తవ్యస్తంగా మారిందన్నారు. రోడ్డుపై పలుచోట్ల వర్షపునీరు నిల్వవుండడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రయాణికులు, విద్యార్థులు రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు రామకృష్ణ, సీఐటీయూ నాయకులు ఎల్లరాజు, కేశాలు, అయ్యస్వామి, కలందర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

సి.బెళగల్: వైద్య రంగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రజలు, అధికారుల నుంచి గుర్తింపు తప్పక లభిస్తుందని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిధున్‌కుమార్ రెడ్డి అన్నారు. పీహెచ్‌సీలో ఉత్తమ సేవలు అందించిన నర్సు, ఆశా వర్కర్లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పీహెచ్‌సీలో జరిగిన కార్యాక్రమంలో.. ఆసుపత్రిలో కాన్పుల పురోగతిపై పీహెచ్‌సీ స్టాఫ్ నర్సు వెంకటేశ్వరమ్మను, ఆశావర్కర్లు సి.బెళగల్ – 1 ఉషారాణి, గొల్లలదొడ్డి – సుధారాణి, కొండాపురం – రేణుక, ఇనగండ్ల – లక్ష్మీదేవిలను ఉత్తమ సేవకులుగా గుర్తించి, వారికి ప్రత్యేక జ్ఞాపికలతో సన్మానించారు.


సి.బెళగల్ పీహెచ్‌సీలో ఉత్తమ ఆశాలను సన్మానిస్తున్న వైద్య అధికారులు

ఈ సందర్భంగా డాక్టర్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది సేవల గురించి మాట్లాడారు. సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ మంగమ్మ, హెచ్‌ఈ పుష్పావతి, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

నగరపాలకలో జెండా పండుగ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య, కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. నగరపాలకలోని ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం మనకు సులభంగా రాలేదని, అనేక మంది యోధుల త్యాగనిరతితో మనం నేడు స్వేచ్ఛా జీవనం పొందుతున్నామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. పరిశుభ్రమైన కర్నూలు, పచ్చని కర్నూలు సాధనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, సీటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక వర్గం ఈ నెల 16న పదవీ ప్రమాణ స్వీకారం చేయనుంది. మార్కెట్ కమిటీకి గౌరవ చైర్మన్‌గా కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్, చైర్మన్‌గా గోల్కొండ అబ్బుత్ బీ, వైస్ చైర్మన్‌గా కే.శేషగిరిశెట్టి నియమితులయ్యారు. మొత్తం 20 మందితో పాలకవర్గం ఏర్పాటైంది. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ గురువారం రాత్రి జీఓ ఆర్‌టీ నంబరు 717 జారీ చేశారు.

మాజీ సైనికులకు ఉచిత న్యాయసేవలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మాజీ సైనికుల చట్టబద్ధమైన సమస్యలను పరిష్కరించేందుకు ఉచిత న్యాయ సేవలు అందించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.కబర్ధి చెప్పారు. శుక్రవారం స్థానిక సీ క్యాంప్‌లోని జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో మాజీ సైనికుల కోసం నల్సా వీర్ పరివార్ సహాయత యోజన – 2025లో భాగంగా లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకటశేషాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జీ.కబర్ధి మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో న్యాయవాదితో పాటు ప్యారా లీగల్ వలంటీరు కూడా ఉంటారన్నారు. లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. మాజీ సైనికులందరు ఉచిత న్యాయ సేవలకు అర్హులన్నారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్‌ఆర్ రత్నరూత్, న్యాయవాది హేమలతారెడ్డి, పారా లీగల్ వలంటీరు మధుసూదన్, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.కబర్ధి

భక్తిశ్రద్ధలతో లక్ష కుసుమార్చన


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ దేవి

కర్నూలు కల్చరల్: స్థానిక సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని చౌడేశ్వరీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, వివిధ రకాల లక్ష పుష్పాలతో అర్చన, సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, తదితర పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని దీప హారతులు ఇచ్చారు. తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భరత మాత మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు



సి.బెళగల్ ప్రధాన రోడ్డు గుంతలు, బురదమయంగా మారడంతో తిరంగా ర్యాలీలో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

మడుగులున్నా చెదరని స్ఫూర్తి

సి.బెళగల్: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు పూర్తి అధ్వానంగా మారడంతో విద్యార్థులు బురద నీటిలోనే అవస్థలు పడుతూ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో పాటు బురదమయంగా మారడంతో నిత్యం ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో గురువారం సాయంత్రం చిన్నపాటి జల్లులతో వర్షం కురిసింది. దీంతో ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రోడ్డు చిత్తడిగా మారి అడుగుతీసి అడుగు వేయలేని దారుణ దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 50 మీటర్ల భారీ జాతీయ పతాకంతో బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. రోడ్డుపై అడుగడుగునా గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలిచి, అడుగుకో మడుగు ఉండటంతో చిన్నారులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. బురదలో జారి పడిపోయే పరిస్థితి ఉన్నా జాతీయ స్ఫూర్తిని చాటుతూ విద్యార్థులు జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. వారి స్ఫూర్తిని ప్రజలు మెచ్చుకుంటూ రోడ్డును బాగు చేయలేని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.